**ఖమ్మం జిల్లా సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు**

*శాతం లెక్కలను పరిశీలిస్తే ఆశ్చర్యంతోపాటు అనుమానం కలుగుతోంది. ఈ ఏడాది జనవరి కంటే ఏప్రిల్, మే నెలల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఎక్కువమంది కేంద్రాలకు హాజరైనట్లు చెబుతున్న అధికారుల లెక్కలు చూస్తే నిజంగా హాజరయ్యారా..? అంకెలగారడీనా.. అర్థంకావడం లేదు. ప్రతిసారి వేసవిలో హాజరు శాతం తగ్గడం సర్వసాధారణం. జిల్లాలో మొత్తం ఏడు ప్రాజెక్టులు.. ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, మధిర, సత్తుపల్లి, కామేపల్లి, కల్లూరు ఉన్నాయి. వీటి పరిధిలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అయితే అన్ని ప్రాజెక్టుల్లోనూ జనవరి నెలకు మించి వేసవిలో హాజరు శాతం పెరగడం గమనార్హం. ఇదిలా ఉండగా.. భగభగమండే ఎండల కారణంగా పిల్లలు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావడం లేదని, ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు సైతం వేసవిలో సెలవులు ప్రకటించాలని కోరుతూ టీచర్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేయడం విశేషం.*

*- ఖమ్మం వ్యవసాయం, జూన్ 18*

**ఈ ఏడాది మండువేసవిలోనూ నిండుగా హాజరు శాతం**

**ఎన్నడూలేని విధంగా పెరిగిన ఐసీడీఎస్ లబ్ధిదారులు**

**జనవరిలో కంటే ఏప్రిల్, మే నెలల్లోనే అధికం**

**ఆశ్చర్యం గొలుపుతున్న అధికారుల లెక్కలు**

# అంగన్‌వాడీల్లో అంకెల గారడీ!

**అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరైన చిన్నారులు, గర్భిణులు, బాలింతలు**

| | |
|---|---|
| జనవరి | 74,091 |
| ఏప్రిల్ | 75,775 |
| మే | 76,020 |


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు (ఫైల్)

మాతా, శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం అందించడంతోపాటు చిన్నారులకు చిన్నతనం నుంచి విద్యపై పట్టు సాధించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తుంటాయి. అయితే పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీలకు సైతం పండుగల వేళ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతల హాజరు శాతం తగ్గడం సర్వసాధారణం. అయితే జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతాన్ని పరిశీలిస్తే.. ఎండవేడిమి ఎంత ఎక్కువైతే అంత హాజరు శాతం పెరగడం అనుమానాలకు తావిస్తున్నది. ఈ అంకెలు చూస్తే 'చిత్రం భళారే విచిత్రం'లా కనిసిస్తున్నది. జిల్లా సంక్షేమ శాఖ పరిధిలో ప్రస్తుతం ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, మధిర, సత్తుపల్లి, కామేపల్లి, కల్లూరు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా ప్రతిరోజు మధ్యాహ్న భోజనంతోపాటు 200 గ్రాముల పాలు, కోడిగుడ్డు అందిస్తారు. 6 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు బాలామృతం పంపిణీ చేస్తారు. వీటితోపాటు నిబంధనలకు అనుగుణంగా పిల్లల బరువులు, ఎత్తు కొలతల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తుంటారు. కేంద్రాలకు వచ్చి మధ్యాహ్న భోజనం చేసే గర్భిణులు, బాలింతలతోపాటు ప్రీస్కూల్, ఇతర పిల్లల వివరాల హాజరును సైతం నిత్యం ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంగతి తెలిసిందే. అయితే ఏప్రిల్ నెల వచ్చేసరికి వేసవి తాపం మరింత పెరిగింది. ఏ సంవత్సరంలోనైనా ఎండాకాలం వచ్చిందంటే గర్భిణులు, బాలింతలతోపాటు చిన్నారుల హాజరు శాతం తక్కువ నమోదు కావడం సర్వసాధారణం. అయితే జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల్లో సైతం జనవరి నెలకు మించి చిన్నారులు, గర్భిణులు, బాలింతల హాజరు శాతం పెరగడం గమనార్హం.

### పోటీపడి పెరిగిన లబ్ధిదారులు

అక్కడ పెరిగింది.. ఇక్కడ పెరగలేదు.. అనే సందేహం లేకుండా జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోనూ అటు చిన్నారులు, ఇటు గర్భిణుల హాజరు శాతం అమాంతం పెరిగింది. కొద్దినెలలుగా ఆయా ప్రాజెక్టులకు పప్పు దినుసుల సరఫరా నిలిచింది. దీనికితోడు పాల పంపిణీ సైతం అక్కడక్కడ నిలిచిపోయింది. అంగన్‌వాడీ టీచర్లు బీఎల్‌వో డ్యూటీలు చేసుకుంటూ ఇటు కేంద్రం బాధ్యతలు సైతం నిర్వహించారు. ఒకవైపు ఎండ తీవ్రత, మరోవైపు ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ హాజరు శాతంలో మాత్రం రికార్డు నెలకొంది. జిల్లావ్యాప్తంగా ఏడు ప్రాజెక్టుల్లో కలిపి పరిశీలిస్తే జనవరి నెలలో చిన్నారుల హాజరు 59,010 మంది కాగా, గర్భిణులు, బాలింతలు 15,081 మంది హాజరయ్యారు. ఏప్రిల్‌లో చిన్నారులు 60,833, గర్భిణులు, బాలింతలు 14,942 మంది హాజరయ్యారు, ఇకపోతే రికార్డుస్థాయిలో ఎండలు కొట్టిన మేలో చిన్నారులు 61,182 మంది, గర్భిణులు, బాలింతలు 14,838 మంది హాజరయ్యారు. ప్రతిఏటా వేసవికాలం వచ్చిందంటే చాలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది, వేసవికావడంతో తల్లిదండ్రులు ప్రయాణాలు చేసే అవకాశం ఉండడంతో పిల్లల హాజరుపై ప్రభావం చూపుతుంది. అయితే ఈ సంవత్సరం చరిత్రలో లేనివిధంగా ఉష్ణోగ్రతలు 45 నుంచి 48 డిగ్రీల వరకు నమోదు అయినప్పటికీ హాజరు పెరిగిందే తప్ప ఏమాత్రం తగ్గలేదు. ఇదిలా ఉండగా.. పిల్లలు, గర్భిణులు కేంద్రాలకు రావడం తగ్గిందని ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అంగన్‌వాడీలకు సైతం సెలవులు ప్రకటించాలని టీచర్లు కలెక్టర్, డీడబ్ల్యూవోకు ఇటీవల వినతిపత్రాలు అందజేయడం విశేషం. అయితే ఈ గణాంకాలు క్షేత్రస్థాయి నుంచి అంకెలగారడీ చేశారా.. లేదా.. యాదృచ్ఛికంగా భారీగా హాజరయ్యారా.. అనేది తెలియాల్సి ఉంది.

**లబ్ధిదారుల హాజరు శాతం ఇలా..**

| ప్రాజెక్టు | జనవరి | ఏప్రిల్ | మే |
|---|---|---|---|
| కల్లూరు | 9,195 | 9,515 | 9,652 |
| కామేపల్లి | 7,460 | 7,677 | 7,773 |
| ఖమ్మం రూరల్ | 13,178 | 13,618 | 13,603 |
| ఖమ్మం అర్బన్ | 17,797 | 18,212 | 18,011 |
| మధిర | 8,535 | 8,592 | 8,500 |
| సత్తుపల్లి | 9,475 | 9,594 | 9,853 |
| తిరుమలాయపాలెం | 8,451 | 8,567 | 8,628 |
| | 74,091 | 75,775 | 76,020 |

### ఏప్రిల్‌లో సాధారణంగా పెరుగుతుంది..

అంగన్‌వాడీ కేంద్రాల్లో సాధారణంగా ఏప్రిల్ నెలలో హాజరు శాతం పెరుగుతుంది. ఏప్రిల్‌లో టీచర్లు, హెల్పర్లు స్పెషల్ డ్రైవ్ చేస్తారు. బహుశా హాజరు శాతం పెరగడానికి ఇదే కారణం కావచ్చు. విద్యా సంవత్సరం ముగిసిన తరువాత నెల కాబట్టి సిబ్బంది చొరవతోనే హాజరు శాతం పెరిగింది. జనవరితో పోల్చుకుంటే తప్పకుండా పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టుల వారీగా హాజరు శాతం పరిశీలించాల్సి ఉంది.

**– కే.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి, ఖమ్మం**

**ఉదయం ఆరింటికే అదుపులోకి తీసుకున్న హవేలీ పోలీసులు**

**59 జీవో కింద దరఖాస్తు చేయడమే నేరమంటూ కారణం**

**గతంలోనే దరఖాస్తును తిరస్కరించిన రెవెన్యూ అధికారులు**

**అయినప్పటికీ ఇంటికొచ్చి 'కృష్ణ'ను తీసుకెళ్లిన పోలీసులు**

**బీఆర్‌ఎస్ కార్పొరేటర్ అక్రమ అరెస్ట్ పట్ల పార్టీ నేతల ఖండన**

**ఖానాపురం హవేలీ స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ నేతల ఆందోళన**

# కర్నాటి అక్రమ అరెస్ట్


బీఆర్‌ఎస్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ అక్రమ అరెస్టును ఖండిస్తూ ఖమ్మంలోని ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న పార్టీ నాయకులు

రఘునాథపాలెం, జూన్ 18: ఖమ్మం మున్సిపల్ కార్పొరేటర్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత, ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణను ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులు మంగళవారం అక్రమంగా అరెస్ట్ చేశారు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి ఫిర్యాదు మేరకు కృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు. తెల్లవారుజామున 6 గంటలకే ఆకస్మికంగా ఇంటికి వచ్చిన పోలీసులు.. విచారణ పేరుతో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. అనంతరం అక్రమంగా అరెస్ట్ చేసిన తమ పార్టీ నాయకుడిని తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఖమ్మం ఏసీపీ రమణమూర్తికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా మచ్చలేని నాయకుడిగా పేరున్న 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణ అరెస్ట్ అక్రమమని అన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. బీఆర్‌ఎస్ నేతలను టార్గెట్ చేసి అక్రమంగా కేసులు పెడుతోందని విమర్శించారు. కర్నాటి కృష్ణపై పెట్టిన కేసు విచిత్రంగా ఉందన్నారు. ఎన్నెస్పీ కాలువ నిర్మాణంలో భాగంగా నాటి ప్రభుత్వం కర్నాటి కృష్ణ సొంత భూమిని తీసుకుందని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నెస్పీ కాలువ గట్టుపై నివసిస్తున్న అనేక మంది పేదలు ఆ స్థలాల రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. తమ పార్టీ నేత కృష్ణ కూడా 59 జీవో కింద రెగ్యులరైజేషన్ కోసం అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడని వివరించారు. అయితే ఆ దరఖాస్తును పరిశీలించిన అధికారులు.. కృష్ణ పొజీషన్‌లో లేకపోవడం కారణంగా ఇప్పటికే తిరస్కరించినట్లు చెప్పారు. అయినప్పటికీ అసలు దరఖాస్తు చేసుకోవడమే తప్పంటూ అతడిని అక్రమంగా అరెస్ట్ చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఆరు గ్యారెంటీల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని.. వారి దరఖాస్తులు తిరస్కరణకు గురైతే ఆ దరఖాస్తులన్నీ అక్రమమేనంటూ ప్రజలందరినీ అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. అంతేగాక 59 జీవో కింద 3 వేలకు పైచిలుకు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని.. వారిని కూడా అరెస్టు చేస్తారా ప్రశ్నించారు. ప్రజాపాలనపై దృష్టి పెట్టకుండా బీఆర్‌ఎస్ నాయకులను టార్గెట్ చేసే ఇలాంటి దుశ్చర్యలు సరైనవి కావని స్పష్టం చేశారు. కర్నాటి కృష్ణ అక్రమ అరెస్ట్ విషయం గురించి తెలుసుకున్న మాజీ మంత్రులు కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్ కూడా హైదరాబాద్ నుంచి వస్తున్నట్లు తెలిపారు. తమ పార్టీ నాయకుడిని తక్షణం విడుదల చేయకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆందోళన చేసిన వారిలో కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు డోకుపర్తి సుబ్బారావు, బత్తుల మురళి, బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణారావు, దిలీప్, జక్కుల లక్ష్మయ్య, పగడాల నరేందర్, లింగనబోయిన సతీశ్, అరెంపుల వీరభద్రం, షేక్ షకీనా, షేక్ ఉస్మాన్, పొదిల నాగరాజు, వీరయ్య, అబ్బాస్, ఈదుల రాజేశ్ తదితరులు ఉన్నారు.

### నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్ట్ చేస్తారు..

**పోలీసులను ప్రశ్నించిన కోర్టు**

ప్రభుత్వ భూమి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించాడనే ఆరోపణలతో బీఆర్‌ఎస్ నాయకుడు, కేఎంసీ 41వ డివిజన్ కార్పొరేటర్ కర్నాటి కృష్ణను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఖమ్మం మూడో అదనపు న్యాయస్థానం తప్పుపట్టింది. ముందస్తు నోటీసులు జారీ చేయకుండా అరెస్ట్ చేసిన విధానం చట్టబద్ధంగా లేదని పోలీసులను కోర్టు మందలించింది. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్ స్వామి ఫిర్యాదు మేరకు ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీసులు కర్నాటి కృష్ణపై కేసు నమోదు చేశారు. మంగళవారం తెల్లవారుజామున ముందస్తు సమాచారం లేకుండా అరెస్ట్ చేశారు. ఈ అరెస్టును తప్పుపడుతూ బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణారావు, దిలీప్‌చౌదరి, తన్నీరు లలిత, చింతల వెంకటేశ్వర్లు ఖమ్మం కోర్టును ఆశ్రయించారు. దీనిపై కోర్టు విచారణ జరిపింది. కర్నాటి కృష్ణ అరెస్ట్ సరైనది కాదని స్పష్టం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 41 కింద నోటీసులు ఇచ్చి కేసు వేయాలని పోలీసులను ఆదేశించింది. కాగా, కేవలం రాజకీయ కుట్రతో కర్నాటి కృష్ణను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్ట్ చేయించేందుకు కుటిల పన్నాగం పన్ని విఫలమైందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు.

**జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం**

# మరో పోరాటానికి సిద్ధం

- టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ


మాట్లాడుతున్న అల్లం నారాయణ

ఖమ్మం, జూన్ 18 : దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం, అక్రిడిటేషన్ల మంజూరు, పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఫండ్, హెల్త్‌కార్డుల కోసం జర్నలిస్టులు మరో వీరోచిత పోరాటానికి సిద్ధం కావాలని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ పిలుపునిచ్చారు. టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం ఖమ్మంలోని డీపీఆర్సీ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌హజారి, టెంజు రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, టెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణకుమార్, రాష్ట్ర కోశాధికారి యోగానంద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల కళ్యాణ్ చక్రవర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అల్లం నారాయణ మాట్లాడుతూ కడుపు కట్టుకొని మన సమస్యలను వదిలి రాష్ట్ర సమస్యలపై పోరాడిన చరిత్ర జర్నలిస్టులదే అన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, జర్నలిస్ట్ సంక్షేమ నిధి, అక్రిడిడేషన్లు ఈ నాలుగు అంశాలపై మరో పోరాటానికి జర్నలిస్టులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తాను మీడియా అకాడమీ చైర్మన్‌గా ఉన్న సమయంలో 100 కోట్లతో జర్నలిస్ట్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసుకున్నామని, రూ.15 కోట్లతో మీడియా అకాడమీ భవనం నిర్మించామని తెలిపారు.

**ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంచాలి**

ఖమ్మంజిల్లాలో జర్నలిస్టులకు ప్రత్యేకంగా జీవో జారీ చేసి కేటాయించిన 26 ఎకరాల స్థలాన్ని జర్నలిస్టులకు పంచేంత వరకు ఉద్యమించాలని అల్లం నారాయణ అన్నారు. జర్నలిస్టుల పక్షాన పోరాడుతున్న ఖమ్మంజిల్లా కమిటీ చొరవను అభినందించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ రావు మాట్లాడుతూ ఇండ్ల స్థలాల సాధనకు రాష్ట్ర కమిటీ నుంచి వచ్చి ఖమ్మంజిల్లా జర్నలిస్టుల ఉద్యమంలో పాలు పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఖమ్మంజిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా జర్నలిస్టులకు అందాల్సిన ఇంటిస్థలాలు అందకుండా పోయాయన్నారు. ఖమ్మంజిల్లాలో 23 ఎకరాలు, కొత్తగూడెం జిల్లాలో 17 ఎకరాలు కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపినా అందకపోవడం శోచనీయమన్నారు. యూనియన్ కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం టీయూడబ్ల్యూ(టీజేఎఫ్) ద్వారానే సాధ్యమన్నారు. జర్నలిస్టుల కష్టకాలంలో అండగా నిలిచింది టీజేఎఫ్ యూనియన్ మాత్రమే అన్నారు. ఖమ్మంజిల్లా కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో యూనియన్ బలంగా పని చేస్తున్నదన్నారు. కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి షఫీ మాట్లాడుతూ కొత్తగూడెం జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు.

**రామోజీరావు, తమ్మిశెట్టికి నివాళి**

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల విస్తృతస్థాయి సమావేశంలో తొలుత ఇటీవల మృతి చెందిన ఈనాడు సంస్థల అధినేత, జర్నలిస్టు రామోజీరావు, ఇల్లెందుకు చెందిన జర్నలిస్టు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు మృతి పట్ల నివాళులు అర్పించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించి సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర బాధ్యులను సత్కరించారు. సమావేశంలో బొల్లం శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, లింగయ్య, శెట్టి రజనీకాంత్, వనం నాగయ్య, మందుల ఉపేందర్, భారతి, పిన్ని సత్యనారాయణ, ఉదయ్, శ్రీధర్‌శర్మ, గుద్దేటి రమేశ్, ఎలమందల జగదీశ్, అశోక్, జల్ది శ్యామ్, నాగరాజు, వివిధ పత్రికల జిల్లా బ్యూరోలు, స్టాఫర్లు, మండల, నియోజకవర్గ స్థాయి విలేకరులు పాల్గొన్నారు.

# వేతనాలివ్వాలని అంగన్‌వాడీల వినతి


సీడీపీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

పాల్వంచ, జూన్ 18 : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రతీ నెల సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్(ఏఐటీయూసీ అనుబంధ) నాయకులు పాల్వంచలో సీడీపీవో రేవతికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నరాటి ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతీ నెల 14వ తేదీన వేతనాలు చెల్లించేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం ఇంతవరకు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు టీచర్లకు, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లులు, ఆరోగ్యలక్ష్మి బిల్లులు, టీఏ, డీఏలు, ఇన్సూరెన్స్ రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పండుగ వెంకటరమణ, సోయం రాజ్యలక్ష్మి, ఉమాదేవి, పద్మ, లాలి భవాని తదితరులు పాల్గొన్నారు.

# రోజంతా ఎదురుచూపులు...

- ఉద్యోగోన్నతుల అలాట్‌మెంట్ కోసం ఆశగా చూస్తున్న టీచర్లు
- ఆప్షన్స్ పెట్టి రెండ్రోజులైనా అలాట్ చేయని విద్యాశాఖ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 18 : ఉద్యోగోన్నతి అనేది ప్రతి ఉద్యోగి కల.. ఉద్యోగోన్నతి పొందే సమయం కోసం ఆశగా ఎదురుచూస్తుంటారు.. అలాంటి సమయం కోసం కొన్ని సంవత్సరాలుగా విద్యాశాఖ పరిధిలోని పండితులు, పీఈటీలు పడిగాపులు కాస్తున్నారు.. 2023 సంవత్సరంలో అప్పటి సీఎం కేసీఆర్ కరుణించి పోస్టులను అప్‌గ్రేడ్ చేసేందుకు జీవోలను విడుదల చేశారు. కానీ అమలులోకి వచ్చేసరికి రోజురోజుకు ప్రక్రియ ఆలస్యమవ్వడంతో ఉపాధ్యాయుల్లో నిరుత్సాహం వస్తున్నది. అప్‌గ్రేడ్ ఉపాధ్యాయులకు సంబంధించి ప్రక్రియలో భాగంగా మల్టీజోన్-1 పరిధిలోని ఉద్యోగోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను ఈ నెల 18వ తేదీ వరకు ముగిస్తానని పేర్కొంది. కానీ వాస్తవంలో నేటివరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ ముగియలేదు, బదిలీల ప్రక్రియ ప్రారంభంకాలేదు.

**ఎదురుచూపులే మిగిలాయి...**

ఉద్యోగోన్నతులు పొందే లాంగ్వేజ్ పండిట్ తెలుగు, హిందీ, పీఈటీ ఉపాధ్యాయులు ఈ నెల 13వ తేదీన వెబ్ ఆప్షన్స్‌కి అవకాశం కల్పించారు. సాంకేతిక కారణాలంటూ ప్రక్రియను నిలుపుదల చేస్తూ మళ్లీ వెబ్ ఆప్షన్స్‌కి ఈ నెల 15, 16వ తేదీల్లో అవకాశం ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యాశాఖ కల్పించిన అవకాశం మేరకు ఉద్యోగోన్నతులు పొందే క్రమంలో సీనియార్టీ ప్రకారం ఖాళీల జాబితాపై కుస్తీ పట్టి ఆప్షన్స్ ఎంపిక చేసుకున్నారు. అధికారులు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం అలాట్‌మెంట్ రావాలి. జిల్లాలో ఉద్యోగోన్నతులు పొందే ఉపాధ్యాయులు సోమవారం ఉదయం నుంచే తమ వ్యాపకాలన్నింటిని పక్కనపెట్టి అలాట్‌మెంట్ ఎప్పుడు వస్తుందా అనే దానిలో మునిగిపోయారు. సోమవారం బక్రీద్ సెలవుదినం అయినప్పటికీ రోజు పాఠశాలకు వెళ్లిన దానికంటే ఎక్కువగా అలాట్‌మెంట్ కోసం ఎదురుచూసి రాత్రికి కూడా రాకపోవడంతో అలసిపోయి నిట్టూర్చారు. మంగళవారమైనా వస్తాయని ఉదయం నుంచి అదే పనిలో తోటి ఉపాధ్యాయులకు ఫోన్‌లు చేసి ఇంకెప్పుడు వస్తాయి అలాట్‌మెంట్‌లు అని అడగడమే కనిపించింది. ఉపాధ్యాయ సంఘాల నుంచి అధికారుల వరకు ఆలస్యానికి గల కారణాలను ఎవ్వరిని అడిగినా ఇంకో గంటలో వస్తాయని చెప్పడంతో నిరుత్సాహపడ్డారు.

**రిలీవింగ్ రెడీగా...**

ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న పాఠశాలలో రిలీవింగ్ ఇచ్చేందుకు రిలీవింగ్ లెటర్‌లను కూడా రాసి రెడీగా ఉంచుకున్నారు. వెబ్ ఆప్షన్స్ ద్వారా అలాట్ అయ్యే స్కూల్‌లో జాయినింగ్ ఇచ్చేందుకు కూడా లెటర్‌లను సిద్ధం చేసి పెట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నానికి అలాట్‌మెంట్‌లు వస్తే మధ్యాహ్నం ఇక్కడ రిలీవ్ అయ్యి సాయంత్రానికి అలాట్ అయిన స్కూల్‌లో రిపోర్ట్ చేయడానికి సిద్ధమయ్యారు. సాయంత్రం స్కూల్ ముగిసే సమయానికి కూడా అలాట్‌మెంట్ రాకపోవడంతో నిరాశే మిగిలింది.

# భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం


రామయ్యకు నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, జూన్ 18: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు అర్చకులు నిత్య కల్యాణాన్ని నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న 18 జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

